


కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(శుక్రవారం)
కనిష్ఠం : 27

ప్రాణాంతకం.. ధూమపానం 4



చంద్రబాబు నేడు కోనసీమకు



చెయ్యేరులో ఏర్పాటైన ప్రజావేదిక

- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సీఎం పాల్గొనే రెండు సభా వేదికలను సిద్ధంచేసిన అధికారులు
- సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్.. పరిశీలించిన డీఐజీ అశోక్‌కుమార్
- 700 మందితో పోలీసు పటిష్ట బందోబస్తు
- ఆరు గంటల పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు దాట్ల, రాజప్ప.. పెందుర్తి

అమలాపురం/ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జరపనున్న పర్యటనకు అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో భారీ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. హెలిప్యాడ్‌తోపాటు రహదారులు అభివృద్ధి, సీఎం పాల్గొనే రెండు ప్రాంతాల్లో బహిరంగ సభలకు భారీ వేదికలు సిద్ధమయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పూడికతీత పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఆరు గంటలపాటు రెండు గ్రామాల్లో జరిగే సీఎం పర్యటనకు అనూహ్యమైన రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం సీఎం కాన్వాయ్‌తో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు సభావేదికల వద్ద భారీ సామర్థ్యం కలిగిన జనరేటర్లను ఏర్పాటుచేశారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కూలర్లు, ఏసీలు ఏర్పాటుచేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు వంటివి ప్రజల కోసం సిద్ధం చేస్తున్నారు. అతిథుల కోసం ప్రత్యేక భోజన ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాగా సీఎం చంద్రబాబు శనివారం నాటి పర్యటనకు సంబంధించి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. హెలిప్యాడ్ నుంచి ట్రయల్ రన్ ప్రారంభమై సత్తెమ్మతల్లి గుడి మీదుగా చెయ్యేరు గున్నేపల్లి, చెయ్యేరు వరకు నిర్వహించారు. సీఎం పాల్గొనే కార్యక్రమాల వద్ద కూడా ట్రయల్ రన్ నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, మంత్రి సుభాష్, సీఎం పర్యటన కమిటీ సారథి పెందుర్తి వెంకటేష్, పలువురు నేతలు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. తర్వాత కొన్ని సూచనలు చేసి, వాటిని సరిదిద్దాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా..

సీఎం చంద్రబాబు పర్యటనలో స్వల్పమార్పులు జరిగాయి. ఆ ప్రకారం.. శనివారం ఉదయం 11 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరతారు. 11.45 గంటలకు కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 11.45 గంటల నుంచి 12.10 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో పరస్పర సంభాషణలు ఉంటాయి. 12.10 గంటలకు బయలుదేరి కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి రోడ్డు మార్గాన బయలుదేరతారు. 12.15 గంటల నుంచి 45 నిమిషాలపాటు పేదల సేవలో కార్యక్రమం బంగారు కుటుంబం(పీ4)లో భాగంగా గ్రామస్తులు కొందరిని దాతలు దత్తత తీసుకుంటారు. అలాగే ఉపాధి పథకం కింద చేపట్టే చెరువు పూడికతీత పనుల పరిశీలన, కార్మికులతో సమావేశం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరి చెయ్యేరులో ప్రజావేదిక జరిగే ప్రాంతానికి చేరుకుంటారు. 1.05 గంటల నుంచి 2 గంటల వరకు సమయాన్ని రిజర్వు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు స్థానిక ప్రజలతో ప్రజావేదికలో ముఖాముఖి సమావేశమవుతారు. 3.30 గంటలకు ప్రజావేదిక నుంచి బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి వద్దనున్న టీడీపీ కేడర్ సమావేశ వేదికకు చేరుకుంటారు. 3.35 గంటల నుంచి 5.05 గంటల వరకు కేడర్ సమావేశంలో పాల్గొంటారు. అక్కడినుంచి బయలుదేరి 5.10 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5.15 గంటలకు హెలిప్యాడ్‌కు నుంచి బయలుదేరి ఆరు గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకుంటారు.

నేడు జిల్లావ్యాప్తంగా..

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- ఒకరోజు ముందుగానే పింఛన్లు

కలెక్టరేట్(కాకినాడ), మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మొత్తంగా 2,69,873మందికి రూ.116కోట్ల79లక్షల నిధులు విడుదల చేశారు. దీనిలో ఓఏపీ 1,29,775మందికి, వితంతువులు 73,856మందికి ఇస్తున్నారు. దివ్యాంగులు 34.592, ఒంటరి మహిళలు 7784, మత్స్యకారులు 6215, చేనేత కార్మికులు 3388, డప్పు ఆర్టిస్టులు 1563, అభయహస్తం 6019, ట్రాన్స్‌జెండర్లు 108, కళాకారులు 96, సైనిక వెల్ఫేర్ పింఛన్లు 18మందికి ఇస్తున్నారు. శనివారం ఉదయం 7గంటలనుంచి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. తొలి రోజు నూరుశాతం పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

థియేటర్లలో సౌకర్యాలపై కలెక్టర్‌కు నివేదిక

కాకినాడ సిటీ, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడలోని వివిధ సినిమా థియేటర్లలో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించిన అధికారుల బృందం జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించింది. ఈ మేరకు కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర వివిధ థియేటర్లలో చేసిన తనిఖీల్లో గుర్తించిన శానిటేషన్, అగ్నిమాపక, స్టాల్స్‌లో అధిక ధరలకు విక్రయాలు వంటి అంశాలను నివేదికలో పొందుపరిచారు. మూడురోజులక్రితం నగరంలోని వివిధ థియేటర్లను అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో రెవెన్యూ పోలీస్, అగ్నిమాపక, ప్రజారోగ్య, తూనికలు కొలతల శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థలం మార్చారు!

అధికార యంత్రాంగం కదిలింది. భూదాన బోర్డు భూమిలో ఇసుక తరలింది. కోర్టు ఉత్తర్వుల మేరకు అక్కడి ఇసుకను చీడీలపార డ్రెయిన్ పక్కన ఉన్న మరో ఖాళీ స్థలంలోకి మార్చే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

- కదులుతున్న ఇసుక గుట్టలు
- కోర్టు ఉత్తర్వులతో భూదాన బోర్డు నుంచి తరలింపు
- చీడీల పార డ్రెయిన్ సమీపంలో స్టాక్ పాయింట్
- పట్టాదారులకు ఊరట

కాకినాడ ప్రభుత్వ ఐటీఐ వెనుక నుంచి తెచ్చి చీడీల పార డ్రెయిన్ సమీపంలో వేసిన ఇసుక గుట్ట



కాకినాడ, మే 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని భూదాన బోర్డు భూవివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ వెనుక సర్వే నెంబర్ 144/1, 144/3లలో భూదాన భూమికి సంబంధించి 4.7ఎకరాల భూమి ఉంది. ఈ భూమి తమకు పట్టాలు ఇచ్చారంటూ కొందరు కొన్నేళ్లుగా పోరాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ భూదాన బోర్డు 2014, జనవరి 20న ధ్రువీకరించి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు తీర్మానించిందని కొందరు పోరాడుతున్నారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఇటీవల ఆ భూమిలోనే ఇసుకర్యాంపు నిర్వహణకు గనులశాఖ లీజుకిచ్చింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఇసుక స్టాక్ పాయింట్ నిర్వహించుకునేలా లీజు ప్రాతిపదికన తేజా ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేటు లిమిటెడ్‌కు ఆ భూమిని అప్పగించింది. ఆ భూమిని చదును చేసి భారీ ఎత్తున ఇసుకను డంప్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టాదారులు మరోసారి కోర్టును ఆశ్రయించడంతో.. వారంరోజుల క్రితం కోర్టు స్టే ఇచ్చింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి ఉత్వర్వులు అందాయి. ఆ ఇసుక యార్డును సమీపంలోని చీడిలపొర ప్రాంతంలోని మరో స్థలంలోకి మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు అక్కడ ఇసుక స్టాక్ పాయింట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసి, ఇసుక తరలింపు చర్యలు చేపడుతున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని రెండు రేవుల నుంచి ఇక్కడికి ఇసుక తీసుకొస్తున్నారు.

నేటి నుంచి జిల్లాలో మంత్రి నాదెండ్ల పర్యటన

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం నుంచి మూడురోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారికంగా జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందింది. 31వతేదీ మధ్యాహ్నం విజయవాడనుంచి బయలుదేరి సాయంత్రం 4.30గంటలకు పెద్దాపురం చేరుకుంటారు. అనంతరం అక్కడినుంచి 5గంటలకు బయలుదేరి కాకినాడలోని ప్రైవేటు హోటల్‌కు చేరుకుని బసచేస్తారు. జూన్ 1వతేదీ ఉదయం 9గంటలకు పిఠాపురంలోని పాదగయక్షేత్రంలో దివీస్ ల్యాబ్స్ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ప్రారంభిస్తారు. 10గంటలకు నూకాలమ్మ గుడి వీధిలోని చౌకధరల దుకాణంవద్ద రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించి సకలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం మండలం ఎఫ్ కేపాలెంలో పెట్రోల్‌బంకు ప్రారంభిస్తారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొననున్నారు. రాత్రికి మళ్లీ కాకినాడ హోటల్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు. 2వ తేదీ ఉదయం 8గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్తారు.

‘సుఖీభవ’ అనరే..



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో అన్నదాత సుఖీభవకు రీసర్వే గండం
- గత వైసీపీ ప్రభుత్వంలో తప్పిదాలు అన్నదాతలకు శాపంగా మారిన వైనం
- సర్వే నెంబర్ల స్థానంలో తెచ్చిన ఎల్‌పీఎం నెంబర్ల విధానంలో అడ్డగోలు తప్పులు
- ఒక్కో ఎల్‌పీఎంల్లో పదులకొద్దీ రైతుల విస్తీర్ణాలు ఉంచేసి రీసర్వే
- ఉమ్మడి జిల్లాలో 69,327 మంది పథకానికి దూరమయ్యే ప్రమాదం
- ఇప్పటివరకు 8,82,286 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ పరిశీలన పూర్తి
- మరోపక్క అర్హుల జాబితా ఖరారుకు వ్యవసాయశాఖ దాదాపుగా కసరత్తు పూర్తి
- ఈలోపు రెవెన్యూశాఖ తప్పులు సరిదిద్దకపోతే వేలల్లో నష్టపోనున్న రైతులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి రీసర్వే తప్పులు తల నొప్పులుగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అడ్డగోలు వ్యవహారంతో వేలాది మంది అన్నదాతలు ఇప్పుడు పథకానికి దూరమయ్యే ప్రమాదం నెలకొంది. పూర్వపు సర్వే నెంబర్ల స్థానంలో కొత్తగా ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించే క్రమంలో అనేక తప్పులు దొర్లడంతో రైతులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఒక రైతుకు ఒక ఎల్‌పీఎంకు బదులు ఒకే నెంబర్ పదుల కొద్దీ రైతులకు ఇచ్చేసి రీసర్వే పాపాలు చేయడంతో వారి పేర్లు సర్వర్లకు ఎక్కడం లేదు. ఈ తప్పులను సరిచేయాలని వ్యవసాయశాఖ అధికారులు రెవెన్యూశాఖకు వివరాలు పంపినా కనీసం ఖాతరు చేయకుండా వాటిని పక్కన పడేసింది. మరోవైపు జిల్లాస్థాయిలో అర్హుల జాబితాలను తయారు చేసి వాటిని ప్రభుత్వానికి పంపడంలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమైంది. ఈలోపైనా సమస్య పరిష్కారం చేయాలని రైతులు కోరుతున్నారు.

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకం జూన్‌లో అమలు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చే డబ్బులతో కలిసి రైతు కుటుంబం యూనిట్‌గా ఏడాదికి రూ.20వేల చొప్పున ఈ పథకం ద్వారా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని సీఎం ఈ సందర్భంగా స్పష్టంచేశారు. అంటే పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6వేలు, మిగిలిన రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పథకం కింద డబ్బులు జమచేయనున్నారు. అందులోభాగంగా పథకం అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కసరత్తు మొదలుపెట్టింది. అందులోభాగంగా జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలని జిల్లాల వ్యవసాయశాఖలను ఆదేశించింది. ఈనేపథ్యంలో తమ వద్దనున్న వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగా జిల్లాల వారీగా రైతుల వివరాల నివేదికను అధికారులు సిద్ధం చేశారు. వీటిని రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లోని వీఏఏలకు, మండల వ్యవసాయాధికారులకు పరిశీలన కోసం ఇటీవల పంపారు. వెబ్‌ల్యాండ్ వివరాలను సరిచూసి తుది జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో వ్యవసాయాధికారులు, సిబ్బంది ప్రస్తుతం జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. అయితే వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా లబ్ధిదారుల జాబితా తయారీలో ఇప్పుడు వ్యవసాయశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వేలాదిమంది రైతులకు సంబంధించి వివరాలు గందరగోళంగా ఉండడంతో వాటిని నమోదు చేయడానికి నిబంధనలు అంగీకరించక ఏంచేయాలో తెలియక వారిని పక్కన పెడుతున్నారు. దీనికంతటికీ గత వైసీపీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న రీసర్వే తప్పులే కారణం. అప్పట్లో రీసర్వే పేరుతో ప్రభుత్వం ఎప్పటి నుంచో ఉన్న సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబర్ల వ్యవస్థ తీసుకువచ్చింది. ఈవిధానంలో రీసర్వే అనంతరం ఒక రైతుకు ఒక ఎల్‌పీఎం నెంబరు కేటాయించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో రీసర్వే అడ్డదిడ్డంగా జరగడంతో ఎల్‌పీఎం నెంబర్లు ఒక రైతుకు బదులు అదే నెంబరు పది మందికిపైగా రైతులకు అడ్డదిడ్డంగా కేటాయించేశారు. ఇలా వేలాదిమంది రైతులకు ఒకే నెంబరు ఇచ్చేశారు. అయితే ఇప్పుడు ఈ డేటాను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఈ తప్పులతో అనేకమంది రైతులు పంట రుణాలు పొందేందుకు, ఆకాల వర్షాలు, వరదలప్పుడు వచ్చే పంట నష్టపరిహారం తీసుకునేందుకు వీలుకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు ఉమ్మడి ఎల్‌పీఎం ఉన్న రైతులకు సైతం ఈ లబ్ధి అందకుండా పోయింది. అప్పటి నుంచి ఉమ్మడి ఎల్‌పీఎంలను విడదీసి ప్రత్యేక నెంబర్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ పెద్దగా జరగడం లేదు. దీంతో వీరంతా ఇప్పుడు సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆధార్ అనుసంధానంలో తప్పులు, మరణించిన వారి పేరుపై భూమి ఉన్నట్టు చూపించడం, సర్వే నెంబర్లల్లో తేడాలు సైతం చాలా ఇబ్బందికరంగా మారాయి.

సరిచేయకుంటే ఇబ్బందులే..

వాస్తవానికి అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి పొందేందుకు రైతులకు సంబంధించిన అన్ని వివరాలు సక్రమంగా ఉండాలి. ఉమ్మడి ఎల్‌పీఎం ఉంటే అందులో ఉండే రైతులకు లబ్ధి అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకే నెంబరు ఇద్దరు, ముగ్గురు రైతులకు వేసేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం లేదు. దీంతో ఉమ్మడి ఎల్‌పీఎం నెంబర్లతోపాటు ఇతర రెవెన్యూపరమైన అంశాలను సరిచేసేందుకు వ్యవసాయశాఖ రెవెన్యూ అధికారులకు జాబితా పంపింది. ఎల్‌పీఎం సమస్యలు, సర్వేనెంబర్ల తేడాలు సరిచేయాలని కొంతకాలం కిందట పంపించింది. కానీ ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు దీనిపై అసలు దృష్టిసారించలేదు. దీంతో పథకం అమలుకు గడువు దగ్గరపడ్డా సమస్య పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదు. వాస్తవానికి కాకినాడ జిల్లాలో ఇంతవరకు 2,63,416 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేశారు. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 17,021 మంది రైతుల వివరాలను సరిచేసి పంపించాలని తహశీల్దార్లను వ్యవసాయశాఖ అధికారులు కోరారు. కానీ ఇందులో ఇప్పటివరకు 1,169 మాత్రమే పరిష్కరించారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో 2,52,002 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, 2,17,007 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 11,932 మంది రైతుల వివరాలను సరిచేయాలని రెవెన్యూశాఖకు పంపారు. ఇందులో ఇంతవరకు 2,141మాత్రమే పరిష్కారమయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 3,67,049 మంది రైతుల వివరాలకుగాను 3,66,868 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. ఇంకా 40,374 మంది రైతుల సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉండగా, అందులో 2,011 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇలా సరిచేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది. లేదంటే అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్న అన్నదాతలకు ప్రయోజనం దక్కే అవకాశం ఉండదు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ వివరాలు ఇలా...

	కాకినాడ జిల్లా	తూర్పుగోదారి జిల్లా	కోనసీమ జిల్లా
ఆన్‌లైన్‌లో నమోదైన రైతులు	2,63,416	2,52,002	3,67,049
పరిశీలన పూర్తయిన రైతులు	2,63,416	2,17,007	3,66,868
తహశీల్దార్లకు పంపిన సమస్యలు	17,021	11,932	40,374
వీటిలో పరిష్కరించినవి	1169	2141	2011
ఇంకా పెండింగ్‌లో ఉన్నవి	15,852	9791	38,363

కసరత్తు మొదలు..

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు వీలుగా రెవిన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 69,327 మంది రైతులు పథకానికి దూరం కానున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో వివిధసాకులతో రైతు భరోసా కింద లబ్ధిపొందే వారి సంఖ్యను అడ్డంగా కుదించేశారు. ఏటేటా వివిధ నిబంధనల పేరుతో లబ్ధిదారులను తగ్గించేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం సుఖీభవ పథకానికి ఎలాంటి కోతలు లేకుండా వెబ్‌ల్యాండ్ ఆధారంగా కుటుంబం యూనిట్‌గా ప్రతి రైతుకి పథకం అందించేలా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్రస్థాయి నుంచి పంపిన వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా జాబితాను తయారు చేసి రెండు రోజుల్లో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నుంచి ప్రభుత్వానికి జాబితా పంపనున్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరోసారి తనిఖీ చేయనుంది. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాలను మళ్లీ జిల్లాలకు పంనుంది. ఈ జాబితాలను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రదర్శించి త్వరలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆతర్వాత తుది జాబితా రూపొందించి పథకం డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

రేపటి నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో విత్తనాలు నాటేందుకు వీలుగా జూన్ ఒకటి నుంచి గోదావరి ఈస్టన్ డెల్టాలో కాకినాడ కెనాల్‌కు, సామర్లకోట కెనాల్‌కు, బ్యాంకు కెనాల్‌కు సాగునీరు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఒక రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తామని వెల్లడించారు. జూలై మొదటివారంలో పురుషోత్తంపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి, ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తామన్నారు. ఆగస్టు తొలి వారంలో పంపా రిజర్వాయర్‌నుంచి నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. నీటి విడుదల సమయాన్ని అనుసరించి ఖరీఫ్ సాగు చేసుకోవాలన్నారు.


పోలీస్ కానిస్టేబుళ్ల పరీక్షా కేంద్రాల పరిశీలన



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ తుదిరాత (మెయిన్స్) పరీక్షా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జి.బిందుమాధవ్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాలో జూన్ 1వతేదీ అనగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ పోలీస్ కానిస్టేబుల్ తుదిరాత పరీక్షకు సంబంధించి పరీక్షా కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. జిల్లాలోని గండేపల్లి మండలం, సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్, కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ, ఏపీఎస్పీ మోహన్ కాలేజ్, ఐడియల్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, వీఎస్ లక్ష్మి కాలేజీల్లో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి పరీక్షా ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేసి ప్రధాన ద్వారాల వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా పరీక్ష రాయడానికి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మహిళా అభ్యర్థులను మహిళా పోలీస్ కానిస్టేబుళ్లతో తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావుకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లను, పోలీస్ అధికారులను ఆదేశించారు.

మంచు కొండ



చూసే కళ్లు ఉండాలి కానీ మన్యంలో ఎటు చూసినా ప్రకృతి అందాలే కనిపిస్తాయి. ఇక్కడ మండు వేసవిలోనూ అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు ఉదయం, సాయంత్రం వేళల్లో మంచు పడుతోంది. వర్షం వేళ మేఘాల మంచు ముసుగు పచ్చటి కొండలను తాకుతోంది. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని ఫోర్‌బై డ్యాం వద్ద ఈ దృశ్యం చూపరులను కట్టిపడేస్తోంది.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

అరుణ కిరణం



పగలాంతా తీక్షణ కిరణాలతో ప్రజలను బెంబేలెత్తించిన వెలుగుల రేడు సాయం సమయాన మబ్బులమాటుకు వెళ్తున్నాడు. అస్తమించే సూర్యుని అరుణ కిరణాలు తాకి మబ్బులు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. కాకినాడ జిల్లా తుని మండలం గవరపేటలో శుక్రవారం సాయంసంధ్యవేళ కనిపించిన ఈ మనోహరమైన దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



పొగాకు ఏ రూపంలో తీసుకున్నా అది మనిషి పతనానికి దారితీస్తుంది. తద్వారా అనారోగ్య కారణాలు ఏరికోరి తెచ్చుకున్న వారవుతారు. దీన్ని తాగడం వల్ల ఎన్నో రుగ్మతలు పొంచి ఉంటాయి. పొగాకు ఉత్పత్తులు కొనుక్కుని, వాటిని వాడాక రోగాలను కోరి తెచ్చుకోవడమే అవుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధుల బారిన పడక తప్పదు. నేడు జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- పొగ తాగితే ఎన్నో దుష్ఫలితాలు
- సరదాగా ప్రారంభం... పొంచి ఉన్న ప్రమాదం
- ఏరికోరి రోగాలు తెచ్చుకోవడమే అంటున్న వైద్యులు
- ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధులకు కారణం
- నేడు అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం



ప్రాణాంతకం ధూమపానం

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పల్లెలు, పట్టణాలతో సంబంధం లేకుండా పొగతాగేవారు చాలాచోట్ల ఉన్నారు. కొందరు దీన్ని ఒకప్పుడు హుందా, దర్పానికి ఫ్యాషన్ అనుకునేవారు. ఇది కాస్త శ్రుతిమించి అలవాటుగా మారినవారు మానలేక అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. సరదాగా మొదలుపెట్టిన సిగరెట్ కాలక్రమేణా కొందరిని ఖరీదైన మత్తు పదార్థాలవైపు ఉసిగొల్పుతోంది. విజ్ఞానాంశాల్లో యువకులు పోటీపడి ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. ఏది మంచి, చెడు అనే విషయం అర్థం చేసుకుంటున్నారు. అన్నీ తెలిసి కూడా కొందరు పొగాకు సేవనానికి బానిసలవుతున్నారు. కొందరు ఈ రొంపి నుంచి బయట పడలేకపోతున్నారు.

కోట్లలో బానిసలు

ప్రపంచవ్యాప్తంగా పొగతాగే వారి సంఖ్య కోట్లలో ఉంది. దీనివల్ల పక్కనుండే వారు కూడా ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) దీనిపట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. చాలా మంది పొగ తాగకుండా కాలకృత్యాలు తీర్చుకోరని ఓ సర్వే చెప్తోంది. ఇందులో మహిళలు కూడా ఉండడం విశేషం. ఇలా పొగ తాగడానికి ఎన్నో సాకులు చెప్తూ ప్రతిరోజూ ఒక్కో వ్యక్తి సగటున 150 గ్రాముల పొగాకును వారికి తెలియకుండానే శరీరంలోకి తీసుకెళ్తున్నారు. భారతదేశ స్థూల ఆదాయంలో



ఎగుమతుల ద్వారా అధిక ఆదాయం పొగాకు ఉత్పత్తుల ద్వారా లభిస్తోందని, ఇవే ఉత్పత్తులు దేశ మానవ వనరులను నాశనం చేస్తుందని స్పష్టం చేసింది. ప్రధానంగా 18 నుంచి 30 ఏళ్ల యువకులు సిగరెట్, పొగాకు అనుబంధ ఉత్పత్తులను తీసుకుంటూ చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సత్ఫలితాలు కనిపించట్లేదని లేదని వివరించింది.

చెడు అలవాట్లకు మార్గం

కుటుంబ వాతావరణం పిల్లలపై ప్రభావం చూపుతుంది. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కూలి పనికి వెళ్తూ వెంట పిల్లల్ని తీసుకెళ్తుంటారు. తండ్రి ఖాళీ సమయంలో ఓ చుట్ట వెలిగిస్తాడు. దీన్ని గమనించిన పిల్లలు కొంత కాలానికి అదే ప్రయత్నం చేస్తారు. కానీ పిల్లలు చేస్తున్న ఆ పనిని తల్లిదండ్రులు అడ్డుకోరు. ఇదే అదనుగా వారు పెరిగి పెద్దవారయ్యాక ఖరీదైన సిగరెట్ల జోలికి వెళ్తారు. కళాశాలల్లో సిగరెట్‌లో ఉండే పొగాకు లాంటి పొడి (గంజాయి)ని వేసి దమ్ము పీల్చుతారు. తొలి ప్రయత్నంలో కొంతమంది యువకులు తేలికపాటి మత్తుకు చేరువవుతున్నారు. వక్కపొడి మాదిరిగా కనిపించే గుట్కా తినడానికి ఎక్కువ మంది యువకులు ఆసక్తి చూపిస్తున్నారు. వీటి విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా మార్కెట్లో బ్లాక్‌లో ఇవి దండిగా లభిస్తున్నాయి. పిల్లాడు సరదాగా సిగరెట్ తాగుతున్నాడని, తెలిసి ఊరుకుంటే, ఆ తర్వాత వచ్చే వ్యాధులను అరికట్టడానికి లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పొగాకు బానిసలైన వారికి ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుట్కా, పాన్‌మసాలా, జర్దా కిల్లీ తీసుకోవడం ద్వారా నోటి, ప్లీహ కేన్సర్లు వస్తాయని, అవి మనిషి శరీరంలోకి అంత తేలిగ్గా ప్రవేశించవని, ప్రవేశిస్తే ఎన్ని మందులు తీసుకున్నా నిష్ప్రయోజనమేనని వారు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..

సరదాగా ధూమపానం చేస్తే చాలు బానిస అవుతారు. పొగాకులోని నికోటిన్ అత్యంత వేగంగా రక్తంలోకి వెళ్లి ఏడు సెకన్లలోనే మెదడుకు చేరుతుంది. హెరాయిన్, కొకైన్, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాల మాదిరిగానే పొగాకులోని నికోటిన్‌కు కూడా బానిసలుగా మార్చు



కునే గుణం ఉంటుంది. పొగాకును నిత్యం వాడడం వల్ల తీవ్ర ప్రమాదకారిగా మారుతుంది. పొగాకులోని నికోటిన్ రక్తనాళాలను పాడుచేయడంతో పాటు గుండెపోటుకు గురిచేస్తుంది. క్షయ, శ్వాస, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడేలా చేస్తుంది. 40శాతం వరకు కేన్సర్ వ్యాధులు పొగాకు వాడకం వల్లే వస్తున్నాయి. 90శాతం నోటి కేన్సర్లు పొగాకు సంబంధిత వాడకంతో సంభవిస్తున్నాయి. ధూమపానం చేసేవారి ఇళ్లల్లో పిల్లలకు వినికిడి తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. మధ్య వయసులో ఉండి బీపీ, కొలెస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారు ధూమపానం చేస్తే పదినుంచి 15 ఏళ్లకు ముందే మరణిస్తారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

పొగతో వ్యాధులు



పొగాకు పొగ పీల్చగానే నేరుగా అది ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతుంది. ముక్కుభాగంలో ఉండే ఆల్వియోలై అనే గాలి గది 28వ అంతస్థుగా ఉంటుంది. అక్కడే గాలి మార్పిడి జరుగుతుంది. అంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ శరీరానికి అంది మలినమైన కార్బన్‌డైఆక్సైడ్ మార్పిడి ఆల్వియోలై అనే గాలి గదిలోనే జరుగుతుంది. కానీ పొగలో ఉండే కార్బన్‌మోనాక్సైడ్, సైనేడ్ వంటి విష పదార్థాల వల్ల ఆ గాలి గది స్వరూపమే మారిపోతుంది. వాస్తవానికి అక్కడ హిమోగ్లోబిన్ అనే వాహనం మీద ఆక్సిజన్ చేరి శరీరంలోని అన్ని కణాలకు అందాలి. కానీ పొగకులోని విష పదార్థాల్లో ఉండే కార్బన్ మోనాక్సైడ్ హిమోగ్లోబిన్‌తో గాఢమైన బంధాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. దాంతో రక్తంలోని హిమోగ్లోబిన్‌కు ఆక్సిజన్‌ను మోసుకుపోయే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో శరీరంలోని అన్ని కణాలు కార్బన్‌మోనాక్సైడ్‌తో విషపూరితమై ఎన్నో వ్యాధులకు దారితీస్తుంది. దీనివల్ల కొద్ది దూరం కూడా మనిషి నడవలేని పరిస్థితి. కదిలితే నీరసం.. నడిస్తే ఆయాసం. ఎడతెరపి లేకుండా వచ్చే విపరీతమైన దగ్గు పొగాకులో ఉండే ఆక్రోలిన్ అత్యంత విష పదార్థం కారణంగా కలుగుతుంది.



అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్పొరేషన్ ఇంజనీరింగ్ వర్కర్స్

మా సమస్యలు పట్టవా!

- 24 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం, అధికారుల్లో చలనం లేదు
- స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

కార్పొరేషన్ (కాకినాడ), మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా తమ బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తుల శివ పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాకినాడ స్మార్ట్ సిటీ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. 24 రోజులుగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించకపోగా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కింది స్థాయి అధికారులు నామమాత్రపు చర్చలకు పిలిచినప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవట్లేదన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమకు తక్షణం వేతనాలు పెంచడంతో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ విభాగం పనులు నిలుపుదల చేసి నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీధర్, యూనియన్ అధ్యక్షుడు ఏకల శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శంభుప్రసాద్, బత్తుల సత్యనారాయణ, పాలిక సత్యనారాయణ, మద్దూరి వీరభద్రరావు, జాడ అప్పలరావు, పి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం రాక

- అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలకు అరుణ్ సావో హాజరు

రాజమహేంద్రవరం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్ సావో శనివారం రాజమహేంద్రవరం రానున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో హోటల్ మంజీరలో జరిగే అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు మంజీర హోటల్‌లో అహల్యాబాయి హోల్కర్ జయంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు వై.జంక్షన్ నుంచి ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పాల్గొంటారన్నారు. అహల్యాబాయి జయంతిని పురస్కరించుకుని ఆమె చరిత్రపై ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల లక్ష్మీసంతోష్ తెలిపారు.

2న కాకినాడ వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వికాస కార్యాలయంలో జూన్ 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ మేనేజర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30వేల వరకు జీతం, ఇన్సింటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు రాజమహేంద్రవరంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలను ఆదివారం రాజ మహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని రత్న ప్యాలెస్ దగ్గర గల ఐరన్ అండ్ హార్డ్ వేర్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహిస్తున్నట్టు సంఘం కార్యదర్శి జి.రవికుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి నలుగురు విజయవాడలో జూన్ 7, 8 తేదీల్లో జరిగే సీనియర్ మెన్ రాష్ట్ర చదరంగం పోటీలకు మన జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఏపీ చెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9848374133 నెంబరును సంప్రదించాలని రవికుమార్ కోరారు.

సాగుకు సమాయత్తం

కర్ర పెండలం దుంప నాట్లు సీజను ప్రారంభం



రైతులు సేకరించిన నాణ్యమైన విత్తన కర్ర

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్ర పెండలం దుంప సాగుకు మెట్ట ప్రాంత రైతులు సమాయత్తమయ్యారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది మే రెండో పక్షం నుంచే వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, రంగంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, కిర్లంపూడిల్లో భూములను దుక్కి దున్నడం, నారుమడులకు పళ్లాలు కట్టడం, నాణ్యమైన కర్ర పెండలం దుంప కర్ర, విత్తనాల సేకరణ వంటి పనుల్లో రైతులు ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఏటా జూన్ రెండో వారం నుంచి దుక్కి దున్నడం, నారుమడులు వేయడం చేసేవారు. అయితే ఈ ఏడాది వాతావరణం కర్ర పెండలం సాగుకు పూర్తి అనుకూలంగా మారడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. కాగా సగ్గు బియ్యం మిల్లర్ల నుంచి గిట్టుబాటు ధర లభించట్లేదనే కారణంతో కర్ర పెండలం దుంప సాగు విస్తీర్ణం కాలక్రమేణా తగ్గిపోతోందని మెట్ట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లాభదాయకంగా ఉన్న పామాయిల్ తదితర పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగా దుంప దిగుబడులు ప్రతి సీజనుకూ తగ్గుతూ సగ్గుబియ్యం మిల్లులు వరుసగా మూతబడుతున్నాయి. ఐదేళ్ల క్రితం జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో కర్ర పెండలం సాగు జరగ్గా గత ఏడాది కేవలం పది వేల ఎకరాలకు దిగజారింది. ఈ ఏడాది సాగుకు వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉన్నప్పటికీ సగ్గు బియ్యం ఉత్పాదక వ్యయం పెరుగుదల, మార్కెట్లో ధరల తగ్గుదల వంటి అంశాలు కర్ర పెండలం సాగు పెరిగేందుకు ఎంత మాత్రం దోహదపడట్లేదని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. ఈ కారణంగా ప్రతి సీజన్లోనూ మిల్లులు మనుగడ సాగించలేకపోతున్నాయని చెప్పారు.



నారుమడులు (పళ్లాలు) కట్టిన దృశ్యం

మెరుగైన వైద్య సేవలందించండి

- తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి




వైద్య సదుపాయాలు, సేవలపై వైద్యులను ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

రాజానగరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు తగు చర్యలు తీసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి వైద్యులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గల మానసిక చికిత్స కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆ విభాగంలో చికిత్స పొందుతున్న వారితోను, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు పాటిస్తే త్వరగా కోలుకోవచ్చని రోగులకు సూచించారు. చికిత్స పొందుతున్న వారి వివరాలు, అందుతున్న సేవలు, వైద్య సదుపాయాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తామని చెప్పారు.

రక్షణకు వేద్దాం 'టూ స్టెప్స్'

- వాట్సాప్‌లో మార్చుకోవాల్సిన సెట్టింగ్‌పై పోలీసుల అవగాహన
- సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని సూచన

శంఖవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన ఓ యువకుడికి ఇటీవల వాట్సాప్ ద్వారా ఫోన్ వచ్చింది. హిందీలో మాట్లాడటంతో ఫోన్ కట్ చేశాడు యువకుడు. వెంటనే రూ.5 వేలు పంపాలని లేకపోతే నీ కాంటాక్ట్ లిస్టులో ఉన్నవాళ్లందరకీ నీ నగ్న ఫొటోలు పంపుతానని బెదిరింపులు వచ్చాయి. భయంతో పోలీసులను ఆశ్రయించాడు యువకుడు. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేస్తుంటే మరికొంతమంది భయంతో సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు డబ్బులు పంపుతున్నారు. ఇంతకీ మనం ఫోన్‌లో ఉండే కాంటాక్ట్ లిస్టులో ఉన్న వివరాలు అవతలి వ్యక్తికి ఎలా వెళ్తాయే తెలుసా? వాట్సాప్‌లో ఉన్న ఓ సెట్టింగ్ ఆన్ చేసుకోకపోవడమే అందుకు కారణం. ఇదే సైబర్ దొంగలకు వరంగా మారింది. వాట్సాప్‌లో టూ స్టెప్ పిన్ యాక్టివేట్ చేసుకోని యువతను టార్గెట్‌గా చేసుకుని ఫోన్ కాల్ చేసి వారి కాంటాక్ట్ లిస్టులో వ్యక్తులకు మార్ఫింగ్ ఫొటోలతో బెదిరింపులకు దిగుతున్నారు దుండగులు. అయితే సెట్టింగ్‌లను మార్చుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



సెట్టింగ్‌ను మార్చుకోండిలా...

- తొలుత వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లండి
- ఖాతాపై క్లిక్ చెయ్యండి
- టూ స్టెప్ ఆప్షన్‌పై క్లిక్ చేయండి
- మీ పిన్‌ను నమోదు చెయ్యండి
- మీ ఈమెయిల్ చిరునామా నమోదు చేసి సేవ్ చేయండి

అవగాహన ఉండాలి

ప్రతీ ఒక్కరూ సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలి. వాట్సాప్‌ను వినియోగించే ప్రతీ ఒక్కరూ టూ స్టెప్ వెరిఫికేషన్ చేసుకోవాలి. టూస్టెప్ పిన్ నమోదు చేసుకున్న వాట్సాప్‌ను హ్యాక్ చేయాలంటే వాట్సాప్ టూ స్టెప్ వెరిఫికేషన్ అడుగుతుంది. ఓటీపీ లేకుండా వాట్సాప్ హ్యాక్‌చేయడం కుదరదు.


ప్రత్తిపాడు సీఐ బి. సూర్యఅప్పారావు

రైలు టిక్కెట్ల బుకింగ్‌లో ఇక్కట్లు

ఐఆర్‌సీటీసీ వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌లో సాంకేతిక సమస్యలు

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్(ఐఆర్‌సీటీసీ) వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌లు ఇటీవల కొద్దిరోజులుగా తరచూ క్రాష్ అవుతుండడంతో యూజర్లను లాగిన్ కానీయడం లేదు. ఒక్కో సమయంలో లాగిన్ అయినా టిక్కెట్లు బుకింగ్ చేసుకునేందుకు సాంకేతిక సమస్య ఏర్పడుతుంది. జనరల్ టిక్కెట్ల బుకింగ్‌లోనే ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ సమయంలో చుక్కలు చూపిస్తుందని పలువురు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య లేదని యూజర్లు వాపోతున్నారు. ప్రధానంగా మీ ఇంటర్నెట్ కనెక్టివిటీని చెక్ చేసుకోమంటూ ఎర్రర్ సందేశం వస్తుంది. మొబైల్ ఇంటర్నెట్, వైఫై, బ్రాడ్ బ్యాండ్ సేవలు బాగానే ఉన్నప్పటికీ ఇదే సమస్య ఉత్పన్నవుతుందని పలువురు వాపోతున్నారు.

ఇతర యాప్‌ల దోపిడీ

ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్ పోర్టల్ రైల్వే టిక్కెట్ల బుకింగ్‌కు మొరాయిస్తుండడంతో యూజర్లు గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా అదనపు సర్వీసు చార్జీలు చెల్లించి టిక్కెట్లు బుకింగ్ చేసుకోవాల్సివస్తుంది. ఇదే సమయంలో టిక్కెట్ల చార్జీపై అదనంగా రూ.50 చెల్లిస్తే ఒక వేళ క్యాన్సిలేషన్ చేసుకున్నా ఫుల్ రిఫండ్ చేస్తామంటూ వల విసురుతున్నారు. అదే ఏసీ టిక్కెట్లకు, త్రీటైర్ టిక్కెట్లకు అయితే రూ.127, సెకండ్ ఏసీ అయితే రూ.177, ఫస్టు ఏసీకి రూ.295 చెల్లిస్తే త్రీటైర్ టిక్కెట్టు క్యాన్సిల్ చేసుకున్నా పూర్తి రిఫండ్ చేస్తామంటున్నాయి. ఈ విధంగా ప్రయాణికులను ఇతర యాప్‌లు దోపిడీ చేస్తున్నాయని వారు వాపోతున్నారు.

'స్పేసెస్' డిగ్రీ కళాశాలకు అటానమస్ స్టేటస్


స్టేటస్ ఆర్డర్‌ను చూపిస్తున్న విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థలైన స్పేసెస్ డిగ్రీ కళాశాల యూజీసీ (యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్) నుంచి స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్) పొందినట్టు కళాశాల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. ఈ హోదా దశాబ్ద కాలానికి వర్తిస్తుందని, ఈ హోదా సొంతం చేసుకోవడంతో కళాశాలలోనే సొంతంగా కోర్సులు రూపొందించుకుని, సిలబస్ అభివృద్ధి చేసుకోవడంతో పాటు పరీక్షల నిర్వహించి ఫలితాలు వెల్లడించే అవకాశం కలుగుతుందన్నారు. స్వయం ఉపాధి, స్వావలంబన అనే ధ్యేయంతో పనిచేస్తున్న ఈ విద్యాసంస్థకు ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించడం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు మరింతగా అందుబాటులోకి వస్తాయని విజయ్‌ప్రకాష్ తెలిపారు. స్వయం ప్రతిపత్తి ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపర్చే దిశగా కట్టుబడి ఉన్నట్టు శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సీహెచ్ వికె.నరసింహారావు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బంది సహా ఈ ఘనత సాధనలో భాగస్వామ్యైన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిని గాయపర్చిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి దాడి చేసి గాయపర్చిన సంఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జి.జి. ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ షాన్‌బాషా ఈ నెల 28వ తేదీన పట్టణంలో సాయి చికెన్ షాపు వద్ద ఉండగా సాయి, రాజేష్, చందులు వచ్చి ఘర్షణ పడి దాడి చేశారు. కాలర్ పట్టుకుని కొట్టి గాయపర్చారు. గాయపడిన షాన్ బాషాను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు షాన్ బాషా ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు.

మరో ఘటనలో..

వ్యక్తిని కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జిజి. ప్రకాష్ తెలిపారు. వివరాల ప్రకారం.. కొవ్వూరు పట్టణానికి చెందిన కొనకళ్ల అంజి ఈనెల 28వ తేదీన చికెన్‌షాపు శివ ఇంటిలో శుభకార్యానికి వెళ్లాడు. భోజనాలు వడ్డించే సమయంలో షాన్‌బాషాకు, అంజికి మధ్య వివాదం ఏర్పడింది. ఈ ఘటనలో అంజికి గాయాలు కావడంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అంజి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు.

కలెక్టర్ రకం.. చిలుక ఆకారం..

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని ఓ మామిడి రైతు తోటలో మామిడికాయ వినూత్న ఆకారంలో కనిపించింది. స్థానిక రైతు గొనగాల గోపి మామిడి తోటలో కలెక్టర్ రకం మామిడి చెట్టు నుంచి దిగుబడికొచ్చిన ఈ మామిడికాయ చిలుక ఆకారంలో శుక్రవారం ప్రత్తిపాడు మార్కెట్‌కు రావడంతో దానిని ఆసక్తిగా తిలకించారు.


చిలుక ఆకారంలో ఉన్న మామిడికాయ

రత్నగిరిపై యోగాంధ్ర

హాజరైన కాకినాడ జిల్లా జేసీ, టూరిజం ప్రాజెక్ట్ డైరెక్టర్ చైతన్యవర్షిణి

అధిక సంఖ్యలో పాల్గొన్న ఉద్యోగులు, భక్తులు, గ్రామస్థులు


యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, భక్తులు, ఉద్యోగులు



అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, టూరిజం ప్రాజెక్ట్ డైరెక్టర్ చైతన్యవర్షిణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఉదయం 8గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, భక్తులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా నూతనుత్తేజం పొందుతారని పేర్కొన్నారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంప్రదాయం అమూల్యమైన సంపదగా యోగాను అభివర్ణించారు. చిన్నారులకు ఏకాగ్రత కల్పించడంలోను, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి యోగాసనాలు ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. దేవస్థానం వ్రతపురోహితులు, నాయిబ్రాహ్మణులు, శానిటరీ సిబ్బందితో పాటుగా సుమారు 1000 మంది యోగసనాలను వేశారు.

సత్యదేవుడి సన్నిధిలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ రాయ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శుక్రవారం ఒక దాత రూ1,00,116లు విరాళంగా సమర్పించారు. బెంగుళూరుకు చెందిన నడింపల్లి ఎస్‌వి ఎస్‌రాజు, నాగదేవి దంపతులు ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ఘనంగా చండీహోమం

సత్యదేవుడి ఆలయ రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పాట్నా హైకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి మెమెంటో అందజేస్తున్న ఈవో


కార్యకర్తను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నిరసన సమయంలో... అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

శంఖవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): తనను అన్యాయంగా విధుల్లో నుంచి తొలగించారని నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త అస్వస్థతకు గురైంది. అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటువంటి సమాచారం లేకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించాని ఈనెల 27 నుంచి కాకినాడ జిల్లా శంఖవరం ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు రౌతులపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పద్మ నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. అయితే శుక్రవారం ఉదయం యాథావిధిగా నిరసనకు కూర్చున పద్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో యూనియన్ సభ్యులు అంబులెన్స్‌లో రౌతులపూడి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుందని, ఉద్యోగం ఏమైపోతుందోనని ఆవేదనతో 4 రోజులుగా ఏమి తినకపోవడంతో నీరసించిపోయినట్లు యూనియన్ సభ్యురాలు బుల్లెమ్మ తెలిపారు. వెంటనే పద్మను విధుల్లోకి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రంగా విగ్రహం చేతులు విరగ్గొట్టిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): కాపు పోరాట యోధుడు వంగవీటి మోహనరంగా విగ్రహం చేతులు విరగ్గొట్టిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ తెలిపారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి ఊరచెరువు సెంటర్లో రంగా విగ్రహం చేతులు విరగ్గొటడంపై జనసేన, రంగా యూత్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఆందోళనకారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన పి.శ్రీకాంత్‌ను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన యువకుడి అరెస్ట్

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో రహదారి మధ్యన నిలబడి ఇతర వాహనాలకు ఆటంకం కలిగించిన యువకుడిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల టౌన్‌కు చెందిన ఇస్మాయిల్ కాకినాడ జిల్లా జగ్గంపేటలో గురువారం రాత్రి బాగా మద్యం తాగి రోడ్డు మీదకు వచ్చాడు. వాహనాలను అడ్డుకుని ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. దీనిపై సమాచారం రావడంతో పోలీసులు అతడిని అరెస్టుచేశారు.

అన్నవరం దేవస్థానం ఏఈవోకు విభాగం మార్పు

ఈవో షోకాజు నోటీసులు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి శ్రీపుష్పయోగం రోజున మహిళా భక్తురాలిపై ఆలయ ఏఈవో కొండలరావు అసభ్యంగా ప్రవర్తించారని సీఎంవోకు ఓ భక్తుడు ఫిర్యాదు చేసిన సంఘటనపై అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా కొండలరావును ఆలయ విభాగం నుంచి గార్డెన్ విభాగానికి మార్చి పాలంకి జగ్గారావుకు ఆలయ ఏఈవో బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో పాటుగా కొండలరావుకు షోకాజు నోటీసులు జారీ చేసి 5 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలలో కొండలరావు రెండోసారి షోకాజు నోటీసులు అందుకోవడం కొసమెరుపు. అలాగే వచ్చేనెలాఖరికి పదవీ విరమణ చేయనున్నారు.

అనాతవరంలో తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, మే 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం శివాలయం వీధికి చెందిన సుదర్శనం వెంకటసీతారామాచార్యుల ఇంట్లోకి తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. దీంతో చట్టుపక్కలవారు, ఇంటి యజమాని భయభ్రాంతులకు గురయ్యారు. ఆ ఇంటి షెడ్డుపైకి తాచుపాము చేరి 4 రోజులుగా నివాసం ఏర్పరుచుకుంది. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం అతడు తాచును చాకచక్యంగా బంధించి తీసుకెళ్లాడు. పామును అటవీ ప్రాంతంలో వదులుతానని వర్మ తెలిపాడు.


తాచుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

లారీని ఢీకొన్న ఐషర్ వ్యాన్

అక్కడికక్కడే డ్రైవర్ మృతి


నుజ్జునుజ్జు అయిన ఐషర్‌వ్యాన్


క్యాబిన్‌లో మృతిచెందిన డ్రైవర్

దేవరపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా ఐషర్ గూడ్స్‌వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాజమహేంద్రవరం వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఐషర్‌వ్యాన్ దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో ముందు క్యాబిన్ భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్ అక్కడి కక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ వాహనం తమిళనాడుకు చెందినదని గుర్తించినట్టు చెప్పారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మార్చురీకి తరలించినట్టు ఆయన తెలిపారు. అయితే మరణించిన డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం బొల్లువారి వీధికి చెందిన బొల్లు రాజేష్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం, వన్నెపూడి జాతీయ రహదారిపై వస్తుండగా రాజేష్ మోటార్‌బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైందా లేదా ఏదైనా వాహనం ఢీకొందా అనే విషయం తెలియాల్సి ఉంది. గాయపడిన రాజేష్‌ను ప్రత్తిపాడు ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన రాజేష్

గంజాయితో ఆరుగురి అరెస్టు

15 కిలోల గంజాయి, 2 ద్విచక్రవాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మోతుగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): సీలేరు నుంచి గంజాయిని తరలిస్తున్న ఆరుగురు నిందితులను మోతుగూడెంలో ఎస్‌ఐ సాదిక్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లు పట్టుకున్నారు. వారి నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేటకు చెందిన ఎన్.హరికృష్ణ, పిడుగురాళ్లకు చెందిన కె.నవీన్, ఎస్.రాజేష్, తిరువూరుకు చెందిన కె.సిద్ధు, సీహెచ్ సురేష్‌తోపాటు మరో వ్యక్తి సీలేరు నుంచి తెలంగాణకు గంజాయిని తీసుకెళ్తున్నారు. మోతుగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా శుక్రవారం దొరికారు. 15కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.


గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

విశాల్ మార్ట్‌లో తప్పిన పెను ప్రమాదం

గ్యాస్ ఒత్తిడితో పేలిన ఏసీ

టెక్నీషియన్‌కు తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): విశాల్ మెగా మార్ట్‌లో పెను ప్రమాదం తప్పింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లాలా చెరువు సమీపంలో విశాల్ మార్ట్‌ని గురువారం ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో మూడో ఫ్లోర్ వెనుక భాగంలో 8.5టన్నుల ఏసీకి సంబంధించిన ఔటర్ యూనిట్ (బ్లోయర్)లోని గ్యాస్ ఒత్తిడిని టెక్నీషియన్ చెక్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ ధాటికి టెక్నీషియన్ మూడో ఫ్లోర్ నుంచి ఇనుప మెట్లపై రెండో ఫోర్‌లోకి పడిపోయాడు. చేతులు, కాలి తీవ్ర గాయాలయ్యాయి. తొలుతగా ప్రభుత్వాస్పత్రికి తర్వాత మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే 4 ఫ్లోర్లలోనూ నిండుగా సరుకు ఉండడంతోపాటు ప్రమాదం జరిగిన సమయంలో మార్ట్‌లో జనం, సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు. లోపలికి మంటలు వ్యాపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. కాగా ఏసీ టెక్నీషియన్ ఎప్పుడు వచ్చి చెక్ చేసుకుంటున్నాడో తమకు తెలియదని మార్ట్ సిబ్బంది చెప్పడం గమనార్హం. అయితే ఆస్తి నష్టం అంచనా వేయాల్సి ఉంది.



మార్ట్ వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

అరగుండు చేయించుకున్న జగన్ అభిమాని

తూర్పుగోదావరి జిల్లా ఊనగట్లలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి

చాగల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): స్నేహితులకు ఇచ్చిన మాట ప్రకారం జగన్ ఓటమి చెందినందుకు ఆయన అభిమాని అరగుండు చేయించుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలంలో ఈనెల 25న ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలివి. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన వీరవల్లి శివ వైసీపీ కొవ్వూరు నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్‌గా వ్యవహరించేవాడు. ఎన్నికల సమయంలో వైసీపీ గెలుపు ఖాయమని చాలా ధీమా వ్యక్తం చేశాడు. జగన్ ఓడిపోతే అరగుండు చేయించుకుంటానని పందెం కాశాడు. దీంతో జగన్ ఓటమి చెంది సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 25న ఆదివారం సాయంత్రం అతడు అరగుండు చేయించుకుని ఊనగట్ల సెంటర్‌లో కొద్దిసేపు తిరిగాడు. కాగా ఈ విషయం బయటకు పొక్కలేదు. శుక్రవారం ఈ విషయం తెలియడంతో ఆంధ్రజ్యోతి అతడిని పలకరించింది. ముఖ్యమంత్రిగా జగన్ అమలు చేసిన పథకాలు ఆయనను గెలిపిస్తాయని నమ్మానని, కానీ ప్రజలు వైసీపీని తిరస్కరించారని, జగన్ ఓడిపోవడంతో స్నేహితులకు ఇచ్చిన మాట కోసం అరగుండు చేయించుకున్నానని వీరవల్లి శివ బదులిచ్చాడు.


అరగుండుతో వీరవల్లి శివ

రేపు హాకీ మహిళా జట్టు ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), మే 30 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర జూనియర్ బాలికల హాకీ చాంపియన్‌షిప్ జరగనుంది. ఇందులో పాల్గొనే జిల్లా జూనియర్ మహిళా హాకీ జట్టు ఎంపికను జిల్లా క్రీడా మైదానంలో జూన్ 1న నిర్వహిస్తున్నట్టు హాకీ సంఘ జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఉదయం ఎనిమిది గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు.

చురుగ్గా పశువుల సంత ఆధునికీకరణ

» రూ. 1.35 కోట్లతో పనులు » ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్‌కల్యాణ్



పశువుల సంతలో నిర్మాణంలో ఉన్న షెడ్లు

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటకు అనుగుణంగా నిధులు మంజూరు చేయించడమే కాదు పనులు చకచకా సాగేలా చర్యలు చేపట్టారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఎన్నికలకు ముందు, తర్వాత డిప్యూటీ సీఎం హోదాలో పిఠాపురంలో పర్యటించిన సమయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన పిఠాపురం పశువుల సంతను ఆధునికీకరించి రైతులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.35 కోట్లు మంజూరు చేయించారు. రైతులు పశువుల విక్రయాలు సాగించుకునేందుకు వీలుగా షెడ్ల నిర్మాణం చేపట్టారు. రైతులకు విశ్రాంతి, ఇతర అవసరాల కోసం, పశువైద్యాధికారికి ప్రత్యేక భవనం, సంత చుట్టూ ప్రహరీ, పశువులకు తాగునీరు ఇబ్బంది లేకుండా నీటి తొట్టెలు, ర్యాంపుల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర పనులు నిర్వహించనున్నారు. ఇప్పటికే మూడు షెడ్ల నిర్మాణ పనులు సాగుతుండగా రెండు నెలల్లో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టారు. పశువుల సంత ఆధునికీకరణ పూర్తయితే కాకినాడతో పాటు ఉమ్మడి జిల్లా రైతులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఇచ్చిన మాటకు అనుగుణంగా పవన్‌కల్యాణ్ పశువుల సంత పనులను వేగవంతంగా చేయిస్తున్నారని, మూడు దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులన్నీ పరిష్కారమవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలి: ఎస్పీ

కాకినాడ క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ బిందుమాధవ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మహిళా సంబంధిత కేసుల్లో సత్వరం స్పందించి వారికి న్యాయం జరుగుతుందనే మనోధైర్యం కల్పించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిపూట పెట్రోలింగ్ పెంచి దొంగతనాలను నిరోధించాలని, అపరిచితులపై నిఘాపెట్టి రాత్రులు అనవసరంగా తిరిగే వారికి అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. పెండింగు కేసుల్లో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, డ్రగ్స్ వినియోగం, మహిళల రక్షణపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మహిళా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సమస్యలతో వచ్చే భార్యభర్తలకు ఏ విధంగా కౌన్సిలింగ్ ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, సిబ్బంది ఉన్నారు.



సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

జీజీహెచ్ (కాకినాడ)/కాకినాడ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని జీజీహెచ్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి ఆవిష్కరించారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాల అమలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, స్కీం వర్కర్లను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్లతో జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, సీహెచ్ పద్మ, మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, ప్రసాద్, స్వామి, అప్పలరాజు, విజయ్‌కుమార్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఏడుకొండలు, శ్రీను, రాయుడు రమేష్, వాసు, టి.రాణి, రాజా తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

'ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి'

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందించే బాధ్యత కార్యకర్తలదేనని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. టీడీపీ నేత బడుగు శ్రీకాంత్ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలు వార్డుల్లో సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మహానాడులో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన తీర్మానాలను, ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలకు వివరించారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు.

కడప ఎమ్మెల్యే దంపతులకు అభినందన



ఎమ్మెల్యే మాధవి దంపతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): మహానాడు ఏర్పాట్ల పర్యవేక్షణలో కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి కీలక పాత్ర పోషించారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కొనియాడారు. శుక్రవారం ఆయన కడప ఎయిర్‌పోర్ట్‌లో మాధవిరెడ్డి దంపతులను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ వివరాలను ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి

పెద్దాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలను ఆర్‌బీ కొత్తూరులో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అహల్యాబాయి చేసిన సేవలను గుర్తు చేశారు. గూటురు పద్మ, బీజేపీ, హిందూ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని ఉపేక్షించొద్దు

» నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

» పోలీసు అధికారులతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ సమావేశం



పోలీసు అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, మే 30 (ఆంధ్రజ్యోతి): 'మహిళలు, బాలికల రక్షణ, భద్రతే ప్రభుత్వ ధ్యేయం... చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని ఏమాత్రం ఉపేక్షించొద్దు... పోక్సో కేసుల్లో 60 రోజుల్లోపు చార్జిషీటు దాఖలు చేయాలి' అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. శుక్రవారం ఆయన గొడారిగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ రూరల్ సర్కిల్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు పాల్పడేవారి విషయంలో బాధితులకు సత్వర న్యాయం, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు రక్షణ, భద్రతకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి పనిచేయాలన్నారు. నిందితులపై సకాలంలో చార్జిషీటు దాఖలు చేసి శిక్షపడేలా కృషి చేయాలన్నారు. నిరుపేదల స్థలాలను కబ్జా చేసేవారిపై శాఖాపరంగా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మరిన్ని కెమెరాల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తానని, పోలీసులకు అవసరమైన సీసీ కెమెరాలను దాతలు, పార్టీ నాయకులతో ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి కాకినాడ బీచ్ రోడ్డులో లైటింగ్ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకుంటానన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, ఆర్టీసీ బస్సుల్లో స్కూల్స్, కాలేజీలకు వెళ్లే మహిళల భద్రత, రక్షణ కోసం ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, తిమ్మాపురం, కరప, ఎస్ఐలు వై.గణేష్ కుమార్, వీరబాబు, రాజు, మహిళా ఎస్ఐలు మౌనిక, సునీత పాల్గొన్నారు.





పెద్దాపురం, సామర్లకోటల్లో యోగా సాధన చేస్తున్న పంచాయతీ, సచివాలయ, మండల పరిషత్ కార్యాలయాల ఉద్యోగులు

యోగాతో మానసిక, శారీరక దృఢత్వం

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవన శైలిలో యోగాను ఒక భాగంగా చేసుకుని ప్రతి ఒక్కరూ మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీవో కె.హిమమహేశ్వరి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన యోగా శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచివాలయ సిబ్బంది, టీవోటీలకు శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ భైరవమూర్తి, ఏవో సతీష్, జగన్నాథరావు, యార్లగడ్డ బంగార్రాజు, మాధవి తదితరులు పాల్గొన్నారు. అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు బ్రహ్మకుమారి రాజీ పర్యవేక్షణలో యోగా శిక్షణ ఇచ్చారు. అడపా సత్తిబాబు, ఎస్.పవన్, కె.సింగరాజు, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యకర జీవనంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎంపీడీవో డి.శ్రీలలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు.

'ఉపాధి బకాయిలు విడుదల చేయాలి'

పిఠాపురం రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కూరాకుల సింహాచలం డిమాండ్ చేశారు. పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలో శుక్రవారం ఆయన ఉపాధి శ్రామికులతో సమావేశమయ్యారు. వేతనం రూ.600కు, పనిదినాలను 200కి పెంచాలని కోరారు. సంఘ నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పొదుపుపై అవగాహన

గొల్లప్రోలు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కిశోర బాలికలకు శుక్రవారం పొదుపుపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ చేబ్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ మానసాదేవి, సెర్ప్ ఏపీఎం సన్యాసిరావు, డ్వాక్రా సీసీ రాజకుమారి, వెంకటరమణ, వీవోఏలు పొదుపు ఆవశ్యకత, కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా సాధన ద్వారా కలిగే మేలు గురించి తెలియజెప్పారు.



కొత్తపల్లిలో సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ

పెద్దాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత వర్ధిల్లాలని, ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని సీపీఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సినిమా సెంటర్లోని బొమ్మన బసవరాజు విగ్రహానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, చల్లా విశ్వనాథం పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు. ఆంజనేయస్వామి గుడి దగ్గరలో ఉన్న గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సత్తిబాబు, చింతల సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్, శ్రీనివాస్, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడులను నిరసిస్తూ సీపీఎం కొత్తపల్లి మండల శాఖ కార్యదర్శి గురాల అప్పారెడ్డి ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. నాయకులు కె.నాగేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, జి.వెంకటసుబ్బారెడ్డి, ఆంగర వాసు, సుబ్రహ్మణ్యం, చిన్ని పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మణమూర్తి

ఎంపీ సతీష్ కార్యాలయంలో ప్రజాదర్బార్

కాకినాడ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఆదేశాల మేరకు నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి అర్జీలు స్వీకరించారు. మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), అవసరాల హరి, చింతపల్లి అర్జున్, డీఆర్‌యూసీసీ సభ్యుడు ముత్యాల అనిల్ కుమార్, బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బండి నరేంద్ర, న్యాయవాది దుర్గాప్రసాద్, యాళ్ల చక్రవర్తి, సిరియాల కొండబాబు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జిగా కటకంశెట్టిని నియమించాలి'

సర్పవరం జంక్షన్, మే 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మినీ మహానాడును విజయవంతం చేయడంతో పాటు కడపలో నిర్వహించిన మహానాడుకి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలను తీసుకెళ్లి అన్ని సౌకర్యాలు కల్పించిన కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)ని కాకినాడ రూరల్ ఇన్‌చార్జిగా నియమించాలని ఏపీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కాకరపల్లి సత్యవతి భర్త చలపతిరావు డిమాండ్ చేశారు. కరణంగారి సెంటర్లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కడపలో టీడీపీ మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో జరిగిందని, తెలుగు ప్రజల పండుగగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పార్టీ అధిష్ఠానం యువ నాయకత్వానికి పెద్దపీట వేస్తోందన్నారు. యువకుడు, అందరినీ కలుపుకునిపోయే మనస్తత్వం కలిగిన బాబీకి రూరల్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, కౌజు నెహ్రూ, ఏటుకూరి నాగమణి, లోవరాజు, ఉమ పాల్గొన్నారు.

ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతా వారి వీధిలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, హోమం నిర్వహించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం జరుగుతాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి, రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

పెద్దాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా కంటి పరీక్షలు, రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు జరిపారు. శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి పెద్దాపురం ఇన్‌చార్జి ప్రసాద్ ఆధ్వర్యంలో బాల నేత్ర బంధు కో-ఆర్డినేటర్ శివగణేష్ నేతృత్వంలో 175 మందిని పరీక్షించారు. చిల్డ్రన్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, నాని, సందీప్, బంగారం, సాయి, మణికంఠ, మనోజ్, లలిత, లావణ్య, బాషా, హర్ష, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో సతమతం

కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాధారణంగా మే నెలలో రోహిణి కార్తెలో ఎండలు అధికంగా ఉంటాయి. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులు అడపాదడపా వర్షాలు కురవడంతో రోహిణి కార్తె ప్రభావం పెద్దగా కనిపించలేదు. అయితే శుక్రవారం ఉదయం నుంచీ ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కపోతతో సతమతమయ్యారు.

నేడు పిఠాపురం కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం పదకొండు గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనరు నామ కనకారావు తెలిపారు. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చ జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

రెండు నుంచి యోగా పోటీలు

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా పట్టణంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు యోగా గురువు వనం సత్యప్రియ తెలిపారు. 2న 10 నుంచి 18 సంవత్సరాలు, 19 నుంచి 35 సంవత్సరాల వారికి సోలో యోగా, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్ అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం 3 గంటలకు సూర్యరాయ గ్రంథాలయ ఆవరణలో రంగోలి పోటీలు జరుగుతాయి. 4వ తేదీన 35 సంవత్సరాలు పైబడిన వారికి యోగా, 5న గ్రూప్ యోగా, యోగా పెయింటింగ్, క్విజ్, స్కిట్, షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ అంశాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

జీజీహెచ్‌లో ఆర్వో ప్లాంట్

జీజీహెచ్ (కాకినాడ), మే 30 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఆర్‌లో భాగంగా దివీస్ ల్యాబ్స్ రూ.3.50లక్షలతో జీజీహెచ్ ప్రాంగణంలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో 250 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. శుక్రవారం దీనిని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆ సంస్థ హెచ్ఆర్ హెడ్ ఆర్.సుధాకర్, సూపర్‌వైజర్ బాలకృష్ణలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజకుమారి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.వరప్రసాద్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆశాదేవి, ఫ్యాకల్టీ వడ్డి గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ ఖాతాదారుడిని సత్కరిస్తున్న విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు

'సామాన్యులకు మేలు చేసేలా నిర్ణయాలు'

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): సామాన్య ఖాతాదారులకు మేలు చేసేలా విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తోందని ఇన్‌చార్జి డైరెక్టర్ నామన కామరాజు తెలిపారు. పట్టణంలోని ఒక ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన బ్యాంకు ఖాతాదారులు, సర్వసభ్య సమావేశంలో ఆయనతో పాటు బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ కృష్ణమోహనరావు, జేవీ సత్యనారాయణమూర్తి, మేనేజరు గంధం రవికుమార్ పాల్గొని బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు, పహల్గాంలో ఉగ్రవాదుల దాడి-పర్యవసానాలు, బ్యాంకింగ్ రంగంపై ప్రభావం అంశాలపై చర్చించారు. సీనియర్ ఖాతాదారులను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): 11కేవీ గోకవరం ఫీడర్ నందు శనివారం మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగ్గంపేటలోని నెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ వీరభద్రరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మోతుగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్య చేకూరుతుందని మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ నఫియా అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆసుపత్రి సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంగ ఎంఎల్ సుజాత, విజయ రజని, కన్నారావు, ర ంగమ్మ, ఉత్తర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పంచాయతీ ఉద్యోగి

మోతుగూడెం, మే 30(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం మార్కెట్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం ఒక కారు వేగంగా వచ్చి రహదారిపై ఉన్న ఆవును ఢీకొట్టి వెళ్లిపోయింది. అటుగా వస్తున్న పంచాయతీ ఉద్యోగి రామకృష్ణ ఆవు పరిస్థితిని చూసి పశువుల ఆసుపత్రి వైద్యుడు రమేష్‌ను తీసుకొచ్చి వైద్యం చేయించారు. ఆవుకు సెలైన్ పెట్టారు. రెండు రోజులు వైద్యం చేయాలని, మందులు ఇవ్వాలని డాక్టర్ సూచించారు.



ఆవుకు వైద్యం చేయిస్తున్న దృశ్యం

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

మారేడుమిల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను అధికారులు తొలగించారు. మారేడుమిల్లి నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి, మారేడుమిల్లి నుంచి బోదులూరు వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా అక్రమంగా నిర్మించిన 217అక్రమ కట్టడాలను మారేడుమిల్లి తహసీల్దార్ బాలాజీ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో తొలగించారు. ఇదివరకే పలు మార్లు దుకాణాదారులకు, అక్రమ కట్టడాలు నిర్మించిన వారికి రెవెన్యూ శాఖ, పంచాయతీ శాఖ నుంచి నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో శుక్రవారం అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పర్యవేక్షణలో అక్రమ కట్టడాలు కూల్చివేశారు.



చింతూరు ఐటీడీఏ ముందు కొనసాగుతున్న ఆదివాసీల రిలే దీక్షలు

ఆదివాసీల మనుగడే ప్రశ్నార్థకం కానుంది

చింతూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేయాలని కూనవరం జడ్పీటీసీ గుజ్జా విజయబాబు, ఆదివాసీ యువ నాయకుడు కరక రాజ్‌కుమార్ అన్నారు. ఆదివాసీ చట్టాలను, జీవోలను ప్రభుత్వాలు రక్షించని పక్షంలో ఆదివాసీ మనుగడే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. మన్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నూరు శాతం స్థానిక ఆదివాసీ యువతకే కేటాయించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఆదివాసీ జేఏసీ చింతూరు ఐటీడీఏ ముందు రిలే దీక్షలు చేపట్టిన విషయం విదితమే. శుక్రవారం నాటికి దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరం వద్దకు గుజ్జా విజయబాబు, కరక రాజ్‌కుమార్‌లు వచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శుక్రవారం దీక్షను ఉపాధ్యాయుడు శ్యామల సుబ్బయ్య ప్రారంభించారు. కూనవరం మండలం జగ్గవరం, కొండాయిగూడెం, అయ్యవారిగూడెం తదితర గ్రామాలకు చెందిన ఆదివాసీ యువత దీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు జల్లి నరేష్, అనిల్ కుంజా, కట్టం లక్ష్మి, తెల్లం నిరోషా, కె.వెంకన్నబాబు, ఎం.పూర్ణ, నాయకపోడు సంఘం నాయకుడు వి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఆదివాసీలతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

వై.రామవరం, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆదివాసీ అభ్యర్థులతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వై.రామవరం, యార్లగడ్డ సచివాలయాల్లో, తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కు డిమాండ్లతో కూడిన వినతి ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.శాంతిరాజు, జి.మల్లికార్జునరావు, లక్ష్మణరెడ్డి, మురళి, విక్కి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల వద్దే సరుకులు పంపిణీ



తహశీల్దార్ చిరంజీవి

మోతుగూడెం, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటోతేదీ నుంచి రేషన్ డిపోల వద్ద రేషన్ సరుకులు పంపిణీకి అన్ని చర్యలు చేపట్టామని చింతూరు తహశీల్దార్ ఎస్.చిరంజీవి తెలిపారు. శుక్రవారం చింతూరు మండలంలోని చదలవాడ, గూడూరు, కొత్తపల్లి, మోతుగూడెం రేషన్ డీలర్లతో తహశీల్దార్ సమావేశమై సరుకులు పంపిణీపై చర్చించారు. ఈ నాలుగు పంచాయతీల్లో ఎనిమిది రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ జరుగుతుందన్నారు. ఆ గ్రామాల రేషన్ డీలర్లు స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి పండగ వాతావరణంలో సరుకులు పం పిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల వద్ద డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారని తహశీల్దార్ తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'యోగాతో ఏకాగ్రత, చురుకుదనం'



యోగాసనాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉద్యోగులు

ఏలేశ్వరం, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఏకాగ్రత, చురుకుదనం లభిస్తాయని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. శుక్రవారం యోగాంధ్రలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, నాయకులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టి, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ కుశరాజు, వ్యవసాయ అధికారి జ్యోతి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో శుక్రవారం ఉదయం సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు, సచివాలయ సిబ్బంది యోగాపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి, సెంటర్లో మానవహారం నిర్వహించారు. యోగాతో జీవనశైలిలో మార్పులు వచ్చి మనసుకు ప్రశాంతత కలుగుతుందన్నారు. అధికారులు, విద్యార్థులు యోగ సాధన కూడా తప్పనిసరిగా ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లుపాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ప్రత్తిపాడులో భారీ వర్షం



ధర్మవరంలో కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు ఎడతెరిపి లేని కుండపోతగా కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతో విలవిలలాడిన మండల ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది.. ఖరీఫ్ వ్యవసాయ పనులు చేపట్టేందుకు ఈ వర్షం ఎంతో దోహదపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



ప్రత్తిపాడులో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న రొంగల ఈశ్వరరావు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లారీ వర్కర్స్ కార్యాలయం వద్ద సీఐటీయూ జెండాను మండల కమిటీ మండల కమిటీకి చెందిన సి.కామేశ్వరరావు, రొంగల ఈశ్వరరావు ఆవిష్కరించారు. కార్మికుల సమస్య పరిష్కారానికి నిరంతరం పోరాడేది సీఐటీయూ అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ పేరుతో కాలరాస్తుందని మండిపడ్డారు. లేబర్ కోడ్ రద్దుకు దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు శేరుకృష్ణ, అనంతలక్ష్మి, రమాదేవి, వెంకటలక్ష్మి, బాబ్జి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి జైలు, జరిమానా

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజజ్యోతి): జగ్గంపేట సర్కిల్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మంది వాహనదారులను కోర్టులో ప్రవేశపెట్టగా నలుగురికి రూ.10వేలు చొప్పున రూ.40వేలు జరిమానా, ఎనిమిది మందికి మూడు రోజులు జైలు శిక్ష పడింది. పబ్లిక్ ప్లేస్‌లలో తాగుతున్న నలుగురిని కోర్టులో హాజరుపర్చగా ఒకొక్కరికి రూ.500 చొప్పున రూ.2000 ఫైన్ పడిందని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ పేర్కొన్నారు.

సత్యసాయిబాబా ప్రచార రథానికి ఘన స్వాగతం



ప్రచారరథంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుంచి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి ప్రచార రథం సత్యసాయిబాబా ప్రచార రథం జగ్గంపేట సత్యసాయిబాబా ఆలయం వద్దకు చేరుకుంది. జగ్గంపేట కన్వీనర్ వెంట్రాప్రగడ రమేష్ దంపతులు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, సత్యసాయిబాబా భక్తులు, చిన్నారులు నగర సంకీర్తన నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రచార రథాన్ని పట్టణమంతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త ప్రసాద్, తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, కె.శ్రీను, కోర్ర సూరిబాబు, లక్కాకుల శ్రీను, జాజల అచ్యుత్, బండారు అచ్యుత్, కాదిరత్నం, వెంటా ప్రగడగీతాంజలి, గోగుల శైలజ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా రథయాత్రకు శుక్రవారం ప్రత్తిపాడులో భక్తులు ఘన స్వాగతం పలికారు. సాయిభక్తులు హారతులు ఇచ్చి భజనలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. స్వామి వారి రథాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు విభూది, ప్రసాదం, చిత్రపటాలు పంపిణీ చేశారు. అనంతరం సాయి మందిరం వద్ద 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆధ్యాత్మిక విభా గం సమన్వయ కర్త కస్తూరి భాస్కర్, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు, కిర్లంపూడి, ప్రత్తిపాడు కన్వీనర్ కొమ్ముల జయబాబు, ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, ఎం. లక్ష్మణ కుమార్, ఎస్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో శ్రీసత్యసాయిబాబా ప్రచార రథానికి శుక్రవారం భక్తులు స్వాగతం పలికారు. సత్య సాయి బాబా 100వ జయంతి పురస్కరించుకుని అనంతపురం జిల్లా పుట్టపర్తి నుంచి సుమారు 100 రోజులు రాష్ట్రం నలుమూలలా ప్రచార రథం ద్వారా భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. ఏలేశ్వరం విచ్చేసిన రథానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, భజన బృందాలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు.

కార్యక్రమంలో మట్టే సుబ్బారావు, భజంతుల లక్ష్మణరావు, అల మండ వీర్రాఘవ స్వామి, గూనాపు అశోక్, వాగు బలరాం, వాగు రాజేష్, నేతి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సత్యసాయి రథం వద్ద భజనలు చేస్తున్న భక్తులు



ప్రత్తిపాడులో సత్యసాయి రథయాత్రకు ఘన స్వాగతం పలుకుతున్న భక్తులు

అక్రమంగా ఇసుక, మట్టిని తవ్వేస్తున్నారు!

• చోద్యం చూస్తున్న అధికారులు



ఏలేరు కాలువ వద్ద జేసీబీతో లారీలో వేస్తున్న ఇసుక

ఏలేశ్వరం, మే 30 (ఆంధ్రజ్యోతి): యర్రవరం గ్రామంలోని ఏలేరు కాలువలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా జేసీబీతో లారీలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాలువలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు... అయినప్పటికీ తవ్వేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా బహిరంగంగా పగలూ, రాత్రీ తేడా లేకుండా జేసీబీ సాయంతో లారీలు, ట్రాక్టర్లతో తరలించి అక్రమార్కులు వేలాది రూపాయలు వెనకేసుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను నిలిపి వేయాలని రైతులు కోరుతున్నారు.

గండేపల్లి: మండలంలో కె.గోపాలపురం పరిధిలో గత కొన్నేళ్లుగా గ్రావెల్ మాఫియా చెలరేగిపోతుంది. అరకొర అనుమతులతో అడ్డూ అదుపు లేకుండా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా మండలంలో రామేశ్వరంపేట పరిధిలో గ్రావెల్ తవ్వకాలు నిర్వహించి కొండలన్నీ కూడా ఆవిరి చేశారు. ఇప్పుడు అక్రమార్కుల కన్ను గండేపల్లి మండలం కె.గోపాలపురం మీద పడింది. దీంతో ఇక్క డ గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఇక్కడి గ్రావెల్ ఫిల్లింగ్‌లతో పాటు నర్సరీలకు అనుకూలంగా ఉండడంతో పక్క జిల్లా కడియపులంకకు తరలిస్తూ అధికంగా డబ్బులు చేస్తున్నట్టు సమాచారం. ఇంత జరుగుతున్న రెవె న్యూ ఇతర అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం లేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. దీంతో పాటుగా వ్యవసాయ భూ ముల్లో కూడా అనుమతులు లేకుండా నర్సరీలకు అనుకూలంగా ఎర్ర మట్టి తవ్వకాలు చేస్తున్న అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కె.గోపాలపురంలో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్‌లోని బాలాజీజ్యుయలర్స్ ఎదురుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బాటసారులకు, వాహనదారులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొత్త కొండబాబు ఆర్థిక సాయంతో శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్యవెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా వాసవి గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, పొట్టి వీర్రాజు, మానేపల్లి రామానుజ, మాతంశెట్టి నారాయణ, నిట్టల శ్రీనివాస్ కుమార్, కొత్తనాగ పండు, ఉద్దగిరి కామేష్, కాకి ఆనంద్, కాకి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ధ్వంసం హేయమైన చర్య

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): విగ్రహాలను ధ్వంసం చేయడం అనేది హేయమైన చర్య అని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన జగ్గంపేటలో మీడియాతో మాట్లాడారు. వంగవీటి రంగా విగ్రహాన్ని కొత్తపల్లిలో ధ్వంసం చేయడంపై ఆయన మండిపడ్డారు. రంగా విగ్రహం చేతులు ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం రాకుం డా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఒమ్మంగిలో ఉచిత వైద్యశిబిరం

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి భారతీ విద్యానికేతన్ విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చవల ట్రస్టు, జేపీఎస్ మినిస్ట్రీస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని విద్యాసంస్థల కరస్పాండెంట్ సుంకర వీరబాబు ప్రారంభించారు. నేత్ర, డెంటల్, షుగర్,బీపీలకు సంబంధించిన 108 మంది రోగులకు వైద్యులు మౌనిక, మణికంఠత, ప్రదీప్, తదితర వైద్యుల బృందం వైద్యసేవలందించారు. చవల ట్రస్టు నిర్వాహకులు చవల వెంకట్రావు, చవల కామేశ్వరరావు, రాము, ఆనంద్, జువ్వల చక్రధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రేషన్ డీలర్ల కృతజ్ఞతలు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న రౌతులపూడి రేషన్ డీలర్లు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ డోర్ డెలివరీ వ్యాన్‌లు రద్దు చేసి రేషన్ డిపోలకు రేషన్ సరుకులు అమ్మే అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి ప్రత్తిపాడు నియోజకవర్గ రేషన్ డీలర్లు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద శంకర్లపూడి ఎమ్మెల్యే సత్యప్రభ నివాసం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కలిసి రేషన్ డీలర్లు శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.రేషన్ డీలర్ల సంఘ నాయకులు, డీలర్లు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప లోని మహానాడుకు తరలివచ్చిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రత్తిపాడు కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యాలు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో కుమార్ బాబు, యోగా గురువులు దొడ్డిపట్ల సోమన్న దొరబాబు, అల్లూరి అంజనిదే వి చెప్పారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల మహిళ సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం సచివాలయాల సిబ్బందికి యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. సూర్య నమస్కారాలతో పాటు పలు యోగాసనాలు, ధ్యానం, ఆహార నియమాలపై వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో కేవీవీఎస్ కాశీ విశ్వనాథ్, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.